కేకేలైన్‌లో కూలిన చెట్టు

- నిలిచిపోయిన రైళ్ల రాకపోకలు
- విశాఖ-కిరండోల్, కిరండోల్- విశాఖ రైళ్లు దారి మళ్లింపు

మెయిన్ 3వ పేజీలో





పాడేరు మండలం బొక్కెళ్ల వద్ద ఉధృతంగా ప్రవహిస్తున్న వాగు



జి.మాడుగుల మండలంలో ప్రమాదకరంగా ప్రవహిస్తున్న అండంగిసింగి గెడ్డ

కొనసాగుతున్న గెడ్డల ఉధృతి

పాడేరు, జూలై 21 (ఆంధ్రజ్యోతి):

అల్పపీడనం ప్రభావంతో జిల్లాలో ఆదివారం సైతం గెడ్డల ఉధృతి కొనసాగింది. గత మూడు రోజులుగా ఎడతెరిపి లేని వర్షాలతో గెడ్డలు, వాగులు ఉధృతంగా ప్రవహిస్తున్నాయి. అలాగే పంట పొలాల్లోకి వర్షం నీరు చేరడంతో ఇంకా చెరువులను తలపిస్తూనే ఉన్నాయి. జిల్లా కేంద్రం పాడేరు మొదలుకుని జిల్లా వ్యాప్తంగా అల్పపీడన ప్రభావం కొనసాగుతున్నది. పాడేరు మండలంలోని మత్స్యగెడ్డ, రాయిగెడ్డ, చిలకలమామిడి గెడ్డ, పాడేరు, పెదబయలు మండలాలకు సరిహద్దున ఉన్న పరదానిపుట్టు గెడ్డ, జి.మాడుగుల మండలంలోని కోడిమామిడి గెడ్డ, మత్స్యగెడ్డ, ముంచంగిపుట్టు మండలంలో బూసిపుట్టు, లక్ష్మీపురం, రంగబయలు ప్రాంతాల్లోని గెడ్డలు, డుంబ్రిగుడలోని చాపరాయిగెడ్డ, సంపంగిగెడ్డ, లోచలి గెడ్డ వరద నీటితో ఉధృతంగా ప్రవహిస్తున్నాయి. ప్రస్తుత పరిస్థితులు జన జీవనానికి అంతరాయం ఏర్పడుతున్నది. అధికార యంత్రాంగం ముందస్తు చర్యలు, ప్రజల్ని అప్రమత్తం చేయడంతో ఆస్తి, ప్రాణ నష్టాలు సంభవించలేదు జిల్లాలో వర్షాలు కొనసాగుతుండడంతో ఘాట్ మార్గాల్లో రాత్రి వేళల్లో వాహనాల రాకపోకల బంద్ కొనసాగుతున్నది.

మన్యాన్ని వీడని భారీ వర్షాలు

- జన జీవనానికి అంతరాయం
- నేడు చింతూరులో కలెక్టర్ పర్యటన
- కోతకు గురైన గోరపూర్ వంతెన అప్రోచ్ రోడ్డు
- రాత్రి వేళల్లో ఘాట్‌ల్లో రాకపోకలకు నిషేధం



డుంబ్రిగుడ మండలంలో కోతకు గురైన గోరపూర్ వంతెన అప్రోచ్ రోడ్డు

ప్రస్తుతం చింతూరు రెవెన్యూ డివిజన్ ప్రాంతంలో వరద ముంపు అధికంగా ఉండడంతో జిల్లా కలెక్టర్ ఏఎస్.దినేశ్‌కుమార్ సోమవారం అక్కడ పర్యటించనున్నారు. అందుకు ఆదివారం మధ్యాహ్నమే ఆయన చింతూరు బయలుదేరారు. ముంపులో ఉన్న గ్రామాల సందర్శన, పునరావాస, సహాయక కార్యక్రమాలను ముమ్మరం చేయనున్నారు.

చింతపల్లి మండలంలో ఆదివారం ఉదయం నుంచి రాత్రి వరకు ఎడతెరిపి వ్వకుండా వర్షం కురుస్తుంది. చెరువులు, లోతట్టు ప్రాంతాలకు వర్షపు నీరు చేరుకున్నది. చెరువూరు, చౌడుపల్లి, పెద్దగెడ్డ తాజంగి వాగులు ఉధృతంగా ప్రవహిస్తున్నాయి. లోతుగెడ్డ పంచాయతీ ... మిగతా 8వ పేజీలో

లోతట్టు ప్రజలను సురక్షిత ప్రాంతాలకు తరలించాలి

- చింతూరు, రంపచోడవరం అధికారులకు కలెక్టర్ దినేశ్‌కుమార్ ఆదేశం

పాడేరు, జూలై 21 (ఆంధ్రజ్యోతి):



కలెక్టర్ దినేశ్‌కుమార్

జిల్లాలో చింతూరు డివిజన్ పరిధిలో గోదావరి, శబరి నదులు వరదలకు ఉగ్రరూపం దాల్చుతుండడంతో లోతట్టు ప్రాంతాల్లోని ప్రజలను సురక్షిత ప్రాంతాలకు, పునరావాస కేంద్రాలకు తరలించాలని జిల్లా కలెక్టర్ ఏఎస్.దినేశ్‌కుమార్ ఆదేశించారు. వరదల నేపథ్యంలో రంపచోడవరం, చింతూరు డివిజన్లకు చెందిన అధికారులతో ఆదివారం ఆయన టెలీకాన్ఫరెన్స్ నిర్వహించి మాట్లాడారు. వరద ఉధృతి పెరుగుతుండడంతో మొదటి హెచ్చరిక ప్రకటించిన తక్షణమే ప్రజల్ని సురక్షిత ప్రాంతాలకు తరలించాలన్నారు. ఏ ఒక్కరికీ సమస్య తలెత్తకుండా ముందస్తు చర్యలు చేపట్టాలన్నారు. ఇప్పటికే సిద్ధం గా ఉన్న అధికారులు, సిబ్బంది, ప్రత్యేక సహాయక బృందాలు రంగంలోకి దిగాలన్నారు. చింతూరు డివిజన్ పరిధిలోని చింతూరు, కూనవరం, ఏటపాక, వీఆర్.పురం మండలాల్లో వరద ముంపు ప్రభావం అధికంగా ఉండడంతో ఆ నాలుగు మండలాల్లో కంట్రోల్ రూమ్‌లు నిరంతరం పనిచేయాలన్నారు. అలాగే అవసరమైన సహాయక, పునరావాస చర్యలు ముమ్మరం చేయాలన్నారు. అలాగే వరదల నేపథ్యంలో ప్రత్యేకంగా నియమించిన అధికారులు, సిబ్బంది పక్కాగా విధుల్లో ఉండాలని, బోర్‌వెల్స్ సోమవారం నాటికి అందుబాటులోకి రావాలన్నారు. అలాగే లోతట్టు ప్రాంతాల్లోని ప్రజలకు నిత్యావసర సరుకులతో పాటు అవసరమైన ఇతర సామగ్రి అందించాలన్నారు. రంపచోడవరం, చింతూరు ఐటీడీఏ పీవోలు అప్రమత్తంగా ఉంటూ, ఆయా కార్యక్రమాలను పర్యవేక్షించాలన్నారు. అన్నిశాఖలకు చెందిన అధికారులు సమన్వయంతో వరద సహాయక, పునరావాస కార్యక్రమాలు చేపట్టాలని కలెక్టర్ ఆదేశించారు. ఈ కార్యక్రమంలో జిల్లా ఎస్పీ అమిత్‌బర్దార్, రంపచోడవరం, చింతూరు ఐటీడీఏ పీవోలు సూరజ్‌గనోరే, కావూరి చైతన్య, జిల్లా, డివిజన్, మండల స్థాయి అధికారులు పాల్గొన్నారు.

గరిష్ఠ స్థాయికి గుంటవాడ జలాశయం

- 1,355 అడుగులకు చేరిన నీటి మట్టం
- ఏ క్షణంలోనైనా నీటి విడుదల



గరిష్ఠ నీటి మట్టానికి చేరువలో గుంటవాడ జలాశయం

సీలేరు, జూలై 21:

భారీ వర్షాలకు సీలేరు కాంప్లెక్సులోని గుంటవాడ జలాశయం గరిష్ఠ నీటి మట్టానికి చేరువైంది. దీంతో ఏపీ జెన్‌కో అధికారులు అప్రమత్తమయ్యారు. గుంటవాడ జలాశయం గరిష్ఠ నీటి మట్టం 1,360 అడుగులు కాగా ఆదివారం మధ్యాహ్నానికి 1,355 అడుగులకు చేరింది. గత నాలుగు రోజులుగా కురుస్తున్న భారీ వర్షాలకు పిల్లిగెడ్డ, ఐస్‌గెడ్డల నుంచి భారీగా ఇన్‌ఫ్లో రావడంతో నీటి మట్టం పెరిగింది. ఈ సందర్భంగా జెన్‌కో ఈఈ ప్రభాకరరావు విలేకర్లతో మాట్లాడుతూ.. వర్షాలకు గుంటవాడ జలాశయంలోకి మూడు వేల క్యూసెక్కులు ఇన్‌ఫ్లో ఉందన్నారు. మరో మూడున్నర అడుగుల నీటి మట్టం పెరిగితే నీటిని దిగువకు విడుదల చేయడానికి చర్యలు తీసుకున్నామన్నారు. ఇందుకోసం ముందుగా దిగువ ప్రాంతాల ప్రజలు, తహసీల్దార్, సీలేరు పోలీసులు, గుంటవాడ, సీలేరు సర్పంచులకు సమాచారం అందించినట్టు చెప్పారు. రిజర్వాయర్ నీటి మట్టం 1058.5 అడుగులకు నీరు చేరితే ఏ సమయంలోనైనా నీటిని విడుదల చేస్తామని ఈఈ ప్రభాకరరావు తెలిపారు.

జిల్లాలో నేడు పాఠశాలలకు సెలవు

- కలెక్టర్ దినేశ్‌కుమార్ ప్రకటన
- నేడు, రేపు ముంపు మండలాల్లో సెలవులు

పాడేరు,. జూలై 21(ఆంధ్రజ్యోతి):

వరదల తీవ్రత కొనసాగుతుండడంతో జిల్లాలోని విద్యాలయాలకు సెలవులను పొడిగిస్తూ కలెక్టర్ ఏఎస్.దినేశ్‌కుమార్ ఆదివారం అత్యవసర ఉత్తర్వులు జారీ చేశారు. ఈనెల 22న జిల్లా వ్యాప్తంగా, 23న చింతూరు డివిజన్‌లోని నాలుగు ముంపు మండలాలకు సెలవులు ప్రకటించారు. వరదల కారణంగా జిల్లా వ్యాప్తంగా విద్యాలయాలకు 19, 20 తేదీల్లో సెలవులు ప్రకటించిన సంగతి తెలిసిందే. అలాగే వరదలు తగ్గుముఖం పట్టకపోవడంతో సోమవారం(22తేదీన) సైతం జిల్లా వ్యాప్తంగా 22 మండలాల విద్యాలయాలకు సెలవును పొడిగించారు. అలాగే జిల్లాలోని చింతూరు రెవెన్యూ డివిజన్‌లోని చింతూరు, కూనవరం, ఏటపాక, వీఆర్.పురం మండలాల్లో వరద ముంపు ప్రభావం అధికంగా ఉండడంతో సోమ, మంగళవారాలు సెలవులు ఇస్తున్నట్లు కలెక్టర్ పేర్కొన్నారు.

డుడుమ నీటి విడుదల

- రెండు గేట్లు ఎత్తి బలిమెలకు 2000 క్యూసెక్కులు



డుడుమ జలాశయంలోకి వచ్చి చేరుతున్న వరదనీరు

ముంచంగిపుట్టు, జూలై 21:

మాచ్‌ఖండ్ జలవిద్యుత్ కేంద్రానికి నీరందించే డుడుమ జలాశయం నీటిని ఆదివారం విడుదల చేశారు. రెండు గేట్లను ఎత్తి దిగువన ఉన్న బలిమెలకు 2 వేల క్యూసెక్కుల నీటిని విడుదల చేశారు. జలాశయం గరిష్ఠ స్థాయి సామర్థ్యం 2,590 అడుగులు కాగా ఆదివారం 2589.40 అడుగుల నీటి మట్టానికి చేరుకుంది. దీంతో డుడుమ జలాశయానికి చెందిన 6, 7 నంబర్ల గేట్లు ఎత్తి 2 వేల క్యూసెక్కుల నీటిని విడుదల చేశారు. సాయంత్రం 7వ నంబరు గేటుని మూసివేసినట్టు జలాశయం అధికారులు తెలిపారు.

పులకించిన సింహగిరి

విజయవంతంగా ముగిసిన గిరి ప్రదక్షిణ

- సుమారు పది లక్షల మంది పాల్గొన్నట్టు అంచనా
- భక్తులతో పోటెత్తిన సింహాచలం



గిరి ప్రదక్షిణ ముగించి తొలిపావంచా వద్దకు చేరిన భక్తులు

సింహాచలం, జూలై 21:

సింహగిరి భక్త జన ప్రవాహంతో పులకించింది. గిరి ప్రదక్షిణ ఉత్సవం ఆదివారం ప్రశాంతంగా ముగిసింది. శనివారం మధ్యాహ్నం 4 గంటలకు కొండదిగువ తొలిపావంచా నుంచి అప్పన్న పుష్ప రథం భక్తుల హరి నామస్మరణల నడుమ బయలుదేరింది. అడివివరం, ముడసర్లోవ, హనుమంతువాక కూడలి, అప్పూఘర్, ఇసుకతోట, మద్దిలపాలెం, గురుద్వార, మాధవధార, ఎన్ఏడీ, గోపాలపట్నం, ప్రహ్లాదపురం మీదుగా రాత్రి 10.30 గంటలకు సింహాచలం చేరుకుంది. భక్తులు ఆదివారం ఉదయం చేరుకోవడంతో ఆరు గంటల నుంచి 10 గంటల వరకు గోశాలకూడలిలో విపరీతమైన రద్దీ నెలకొంది. కాగా గిరి ప్రదక్షిణలో సుమారు 10 లక్షల మంది భక్తులు పాల్గొన్నట్టు అధికారులు అంచనా వేశారు. గతంతో పోలిస్తే ఈ ఏడాది భక్తుల సంఖ్య విపరీతంగా పెరిగింది. ఎక్కువ మంది యువత ఉత్సవంలో పాల్గొన్నారు. గిరి ప్రదక్షిణ పూర్తి చేసిన భక్తుల్లో కొందరు మెట్లమార్గంలో సింహగిరికి చేరుకుని స్వామివారిని దర్శించుకున్నారు.



కొండ పైనుంచి కిందకు రావడానికి బస్సు ఎక్కేందుకు ప్రయత్నిస్తున్న భక్తులు

త్వరితగతిన దర్శనాలు

ముందుగా ప్రకటించినట్టే ఆదివారం వేకువజామున మూడు గంటల నుంచి భక్తులకు దర్శనాలు కల్పించారు. సాయంత్రం ఐదు గంటల వరకు సుమారు 10 వేల మంది భక్తులు ఆలయ ప్రదక్షిణలు చేశారు. ఈ సందర్భంగా ఆలయాన్ని వివిధ రకాల పుష్పాలతో శోభాయమానంగా అలంకరించి, విద్యుత్ దీపాలను అమర్చారు. భక్తులకు దర్శనం అనంతరం నిత్యాన్న ప్రసాదం అందజేశారు. పిఠాపురానికి చెందిన ఆధ్యాత్మిక సంస్థ కదంబం, దద్దోజనం, చక్కెర పొంగలి, ఒడిశాకు ... మిగతా 8వ పేజీలో

బొర్రా గుహలుపై అలైన్‌మెంట్ మార్పు

రైల్వే శాఖ ఉన్నతాధికారులకు ప్రతిపాదనలు

- వాల్తేరు రైల్వే డీఆర్ఎం సౌరభ్ ప్రసాద్ వెల్లడి
- బొర్రాగుహలును సందర్శించిన డీఆర్ఎం
- డీఆర్ఎంని కలిసిన పలు యూనియన్ల ప్రతినిధులు
- సానుకూలంగా స్పందించిన సౌరభ్ ప్రసాద్

అరకులోయ, జూలై 21:

బొర్రాగుహలుపై వెళుతున్న రైల్వే ట్రాక్‌ల అలైన్‌మెంట్ మార్పునకు సంబంధించి ప్రతిపాదనలను రైల్వే శాఖ ఉన్నతాధికారులకు పంపినట్టు వాల్తేరు డివిజనల్ రైల్వే డివిజనల్ మేనేజర్(డీఆర్ఎం) సౌరభ్ ప్రసాద్ తెలిపారు. ఆదివారం డీఆర్ఎం బొర్రాగుహలును సందర్శించారు. ఈ సందర్భంగా బొర్రాగుహలు టూరిజం ఉద్యోగ సంఘ ప్రతినిధులు, గైడ్స్ యూనియన్, ట్రో సంస్థ, బొర్రా మోటారు యూనియన్ ప్రతినిధుల బృందం సభ్యులు డీఆర్ఎం సౌరభ్ ప్రసాద్‌ను కలిసి బొర్రాగుహలుపై రైల్వే ట్రాక్‌ల నిర్మాణం చేపట్టవద్దని వినతిపత్రాన్ని అందజేశారు. ఈ సందర్భంగా బృందం సభ్యులు మాట్లాడుతూ.. బొర్రా గుహలు జాతి సంపద అని, భౌగోళిక అద్భుతాల్లో ఒకటన్నారు. అటువంటి గుహలును కాపాడాలని, ఇప్పటికే ఉన్న రైల్వే ట్రాక్‌ను మార్చాలని, రెండో ట్రాక్ నిర్మాణం జరపవద్దని కోరారు. ఈ ట్రాక్‌లకు సంబంధించిన అలైన్‌మెంట్‌ను మార్చాలని విన్నవించుకున్నారు. పైనుంచి రైళ్ల రాకపోకలతో గుహలుకు జరుగుతున్న డ్యామేజీని వివరించి, ప్రత్యక్షంగా చూపించారు. గుహలు లేకుంటే లక్షలాది మంది జీవనోపాధి కోల్పోవడంతో పాటు సహజసిద్ధంగా ఏర్పడిన బొర్రాగుహలు కనుమరుగయ్యే ప్రమాదం ఉందన్నారు. జంబో ట్రైన్ రాకపోకలు సాగించిన నాటి నుంచి గుహలు లోపల జరుగుతున్న ప్రమాదకర సంఘటనలను ఈ సందర్భంగా గైడ్స్ యూనియన్ అధ్యక్షుడు రాము, గుహలు మేనేజర్ గౌరీ శంకర్, ఏపీటీడీసీ అల్లూరి జిల్లా యూనియన్ అధ్యక్షుడు ఆర్ఆర్‌వీ.నరసింహ, జేఏసీ సభ్యుడు సోమేశ్వరరావు, మోటారు యూనియన్ అధ్యక్షుడు శ్యాంప్రసాద్, ట్రో సంస్థ ప్రతినిధులు ప్రత్యక్షంగా గుహలు లోపలకు తీసుకు వెళ్లి డీఆర్ఎంకు వివరించారు. దీనిపై స్పందించిన డీఆర్ఎం సౌరభ్ ప్రసాద్ మాట్లాడుతూ.. రైల్వే ట్రాక్‌ల అలైన్‌మెంట్ మార్పుపై ఇప్పటికే ప్రతిపాదనలను రైల్వే శాఖ ఉన్నతాధికారులకు పంపించినట్టు తెలిపారు. రైల్వే ట్రాక్ వల్ల గుహలుకు కలిగే ముప్పుపై పత్రికల్లో వచ్చిన కథనాలపై చర్చ జరిగిందని, అవకాశం ఉన్నంత వరకు వేరే మార్గం నుంచి రైల్వే ట్రాక్ వేసేందుకు ప్రతిపాదనలు పంపామన్నారు. అదేవిధంగా రైల్వే కనస్ట్రక్షన్ డిపార్టుమెంట్‌కు ట్రాక్ మార్పుకు తాను ప్రతిపాదనలు మరోమారు పంపుతామన్నారు. డీఆర్ఎం సానుకూలంగా స్పందించడంపై బృందం సభ్యులు హర్షం వ్యక్తం చేశారు.



వాల్తేరు డీఆర్ఎం సౌరభ్‌ప్రసాద్‌కు వినతిపత్రం అందజేస్తున్న పలు యూనియన్ల ప్రతినిధులు

విశాఖ కార్పొరేషన్‌లో వైసీపీకి షాక్

కూటమిలో చేరిన 12 మంది కార్పొరేటర్లు



- వివరాలు మెయిన్‌లో

రోగులకు సకాలంలో వైద్య సేవలందించాలి

- డీఎంహెచ్‌వో జమాల్ బాషా
- ఇద్దరికి షోకాజ్‌లు జారీ

పెదబయలు, జూలై 21: పీహెచ్‌సీలకు వచ్చే రోగులకు సకాలంలో వైద్య సేవలు అందించాలని జిల్లా వైద్య, ఆరోగ్య శాఖ అధికారి డాక్టర్ సి.జమాల్ బాషా అన్నారు. ఆదివారం మండలంలోని రూడకోట పీహెచ్‌సీని ఆయన ఆకస్మికంగా తనిఖీ చేశారు. రికార్డులను పరిశీలించి, రోగులకు అందుతున్న వైద్య సేవలపై ఆరా తీశారు. వర్షాలకు గ్రామాల్లో వ్యాధులు విజృంభించే అవకాశం ఉందని, వైద్యులు, సిబ్బంది అప్రమత్తంగా ఉండాలని సూచించారు. ఆస్పత్రిలో నిరంతరం రోగులకు అందుబాటులో ఉండాలన్నారు. ఇక్కడికి వచ్చే వ్యాధిగ్రస్తులకు సకాలంలో ఆరోగ్య పరీక్షలు నిర్వహించడంతో పాటు అవసరమైన వైద్య సేవలను అందించాలని సూచించారు. విధి నిర్వహణలో నిర్లక్ష్యం వహిస్తే సహించేది లేదని హెచ్చరించారు. విధుల పట్ల నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్న ఎంపీహెచ్‌ఈవో, హెచ్‌పీలకు షోకాజ్ నోటీసులు జారీ చేసినట్టు డీఎంహెచ్‌వో బాషా తెలిపారు.



రోగులతో మాట్లాడుతున్న డీఎంహెచ్‌వో జమాల్ బాషా



సీలేరు సమీపంలో ఎక్స్‌కవేటర్‌తో చెట్టును తొలగిస్తున్న దృశ్యం...



మార్గమధ్యంలో నిలిచిపోయిన భద్రాచలం-విశాఖపట్నం నైట్ సర్వీస్

సీలేరు సమీపంలో కూలిన భారీ చెట్టు

ఆరు గంటల పాటు నిలిచిన రాకపోకలు.. ప్రయాణికుల అగచాట్లు

సీలేరు, జూలై 21: అల్పపీడన ప్రభావంతో కురుస్తున్న వర్షాలకు శనివారం రాత్రి సీలేరు సమీపంలో రహదారికి అడ్డంగా భారీ చెట్టు పడిపోవడంతో ఉదయం ఐదు గంటల వరకు రాకపోకలు నిలిచిపోయాయి. సీలేరుకు ఒక కిలోమీటర్ల దూరంలో ప్రధాన రహదారిపై రాత్రి పదిన్నర గంటల సమయంలో భారీ చెట్టు కూలిపోయింది. దీంతో భద్రాచలం నుంచి విశాఖపట్నం వెళ్లే బస్సు సీలేరు చెక్ పోస్టు వద్దనే నిలిపివేశారు. అలాగే విశాఖపట్నం నుంచి భద్రాచలం వెళ్లే రెండు నైట్ సర్వీస్ బస్సులు నిలిచిపోవడంతో ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులకు గురయ్యారు. ఈ సమాచారం అందుకున్న ఆర్అండ్‌బీ అధికారులు చెట్టును ఎక్స్‌కవేటర్ సాయంతో తొలగించారు. వారికి ఎస్ఐ రామకృష్ణ, పోలీస్ సిబ్బంది సహకరించడంతో ఆదివారం ఉదయం 5 గంటలకు ఆ రోడ్డుపై రాకపోకలు ప్రారంభమయ్యాయి.

'పేట'లో లండన్ ఐవీఎఫ్ కేంద్రం ప్రారంభం



ఐవీఎఫ్ కేంద్రాన్ని ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే జ్యోతుల నెహ్రూ, చిత్రంలో డైరెక్టర్ డాక్టర్ కె.చంద్రరెడ్డి, డాక్టర్ ఎస్.అనన్య తదితరులు

పాయకరావుపేట, జూలై 21 : పాయకరావుపేట, తుని, అనకాపల్లి పరిసర ప్రాంత ప్రజలకు అందుబాటులో ఉండే విధంగా పాయకరావుపేటలో లండన్ ఐవీఎఫ్‌వారి సంతాన సాఫల్య కేంద్రం ఏర్పాటు చేసినట్టు సంస్థ డైరెక్టర్ డాక్టర్ కె.చంద్రారెడ్డి తెలిపారు. స్థానిక సూర్యమహల్ సెంటర్‌లో లండన్ ఐవీఎఫ్ కేంద్రాన్ని ఆదివారం జగ్గంపేట ఎమ్మెల్యే జ్యోతుల నెహ్రూ చేతుల మీదుగా ప్రారంభించారు. ఈ సందర్భంగా డాక్టర్ చంద్రారెడ్డి మాట్లాడుతూ ఏపీలో సంతాన లేమితో బాధపడుతున్న దంపతులకు దశాబ్దకాలంగా అత్యంత ఆధునిక విధానాల ద్వారా అంతర్జాతీయ స్థాయి చికిత్సను అందిస్తూ ఉత్తమ ఫలితాలు సాధిస్తున్నామన్నారు. సంతానం లేని దంపతులు ఈ సేవలను సద్వినియోగం చేసుకోవాల్సిందిగా ఆయన కోరారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ ఎస్.అనన్య, డాక్టర్ మాధవీలత, జిల్లా గ్రంథాలయ సంస్థ మాజీ చైర్మన్ తోట నగేశ్‌తో పాటు గ్రామ పెద్దలు దేవవరపు సూర్యం, జగతా శ్రీనివాస్, దేవవరపు ఆనంద్ తదితరులు పాల్గొన్నారు.

రాష్ట్రస్థాయి తైక్వాండో పోటీల్లో అడ్డరోడ్డు క్రీడాకారుల సత్తా

తొమ్మిది బంగారు, రెండు రజిత, నాలుగు కాంస్య పతకాలు సొంతం

వచ్చే నెలలో జరగనున్న జాతీయస్థాయి పోటీలకు అర్హత



రాష్ట్ర స్థాయి తైక్వాండోలో పతకాలు సాధించిన క్రీడాకారులు

ఎస్.రాయవరం, జూలై 21 : రాష్ట్రస్థాయి సబ్ జూనియర్, కేడిట్ తైక్వాండో కొరిగి, పూమ్సె చాంపియన్ షిప్ పోటీల్లో మండలంలోని అడ్డ రోడ్డుకు చెందిన క్రీడాకారులు సత్తా చాటారు. గుంటూరు జిల్లా రేపల్లెలో శుక్ర, శనివారాల్లో జరిగిన సబ్ జూనియర్ తైక్వాండో పోటీలకు అడ్డరోడ్డుకు చెందిన ఇరవై మంది క్రీడాకారులు హాజరయ్యారు. వీరిలో కె.హిమబిందు, ఎం.గ్రేసి, కె.అభిలాష్య, జి.కుస్మిత, టి.నిఖిల్, జె.హేమంత్, వి.దుర్గాప్రసాద్, ఎం.అశోక్, శ్యామ్‌లు అద్భుతంగా రాణించి బంగారు పతకాలు సాధించారు. అలాగే, డి.తేజ, కె.నాగాంజలిరజితం, వి.సాయిగౌతమి, ఎస్.వంశీ, ఎం.దుర్గాప్రసాద్, దుర్గ కాంస్య పతకాలను సొంతం చేసుకున్నట్టు తైక్వాండో అసోసియేషన్ జిల్లా ప్రధాన కార్యదర్శి రెడ్డి రామ్‌చరణ్ ఆదివారం ఇక్కడ విలేకరులకు తెలిపారు. ఈ క్రీడాకారులంతా ఆగస్టు 16, 17 తేదీల్లో ఉత్తర ప్రదేశ్ రాష్ట్రం కాన్పూర్‌లో జరగనున్న జాతీయస్థాయి పోటీలకు అర్హత సాధించారన్నారు. ఈ సందర్భంగా క్రీడాకారులను స్పోర్ట్స్ అథారిటీ ఆఫ్ ఆంధ్రప్రదేశ్ (సాప్) కోచ్‌లు ఎం.చిరంజీవి ఎన్‌వీఎన్ రమేష్‌లు అభినందించారు.

శాకంబరిదేవిగా వరమహాలక్ష్మి అమ్మవారు



పాయకరావుపేట, జూలై 21: పట్టణంలో జాతీయ రహదారిని ఆనుకుని ఉన్న చిట్టూరి మెట్రో ప్రాంగణంలో కొలువుదీరిన వైకుంఠ నారాయణ సమేత వరమహాలక్ష్మి అమ్మవారు ఆదివారం శాకంబరి అలంకరణతో భక్తులకు దర్శనమిచ్చారు. తొలుత అర్చకులు అమ్మవారిని విశేషంగా అలంకరించి, ప్రత్యేక పూజలు జరిపారు. అనంతరం భక్తులకు దర్శన భాగ్యం కల్పించారు.

కొనసాగుతున్న విద్యుత్ పునరుద్ధరణ పనులు

విశాఖపట్నం, జూలై 21: వర్షాలు, వరదల వల్ల దెబ్బతిన్న విద్యుత్ లైన్లను యుద్ధప్రాతిపదికన పునరుద్ధరిస్తున్నామని ఏపీఈపీడీసీఎల్ సీఎండీ పృథ్వీతేజ్ ఇమ్మడి తెలిపారు. ఆదివారం ఆయన కార్పొరేట్ కార్యాలయంలో విలేకరులతో మాట్లాడారు. ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు, ఇంధన శాఖా మంత్రి గొట్టిపాటి రవికుమార్, ఇంధన శాఖ కార్యదర్శి కె. విజయానంద్ ఆదేశాల మేరకు ఎప్పటికప్పుడు అధికారులతో సమీక్షలు చేస్తూ త్వరితగతిన విద్యుత్ పునరుద్ధరణకు చర్యలు తీసుకుంటున్నామని చెప్పారు. వర్షాల వల్ల అయిదు సర్కిళ్ల పరిధిలోని 24 మండలాల్లో 140 గ్రామాల్లో 47,999 సర్వీస్ కనెక్షన్లకు అంతరాయం కలిగిందన్నారు. టోల్‌ఫ్రీ నెంబరు, కంట్రోల్ రూమ్‌కు వచ్చిన ఫిర్యాదులను కాల్ సెంటర్ సిబ్బంది ఎప్పటికప్పుడు నమోదు చేసి క్షేత్రస్థాయి సిబ్బందికి త్వరితగతిన చేరవేయడం ద్వారా తక్కువ సమయంలోనే సరఫరాను పునరుద్ధరించగలిగామన్నారు. ఏలూరు, రాజమండ్రి సర్కిళ్లలో ఎక్కువ నష్టం వాటిల్లిందని వెల్లడించారు. కుక్కునూరు, వేలేరుపాడు, రాజీవ్‌నగరం, మారేడుమిల్లి లో 33/11కేవీ విద్యుత్ సబ్‌స్టేషన్లు దెబ్బతినగా వాటిని తక్షణమే పునరుద్ధరించామని చెప్పారు.

చికెన్ ధరలు	
బ్యాగ్	రూ.లలో
రైతు ధర	95.00
లైవ్ ధర	115.00
విత్ స్కిన్	200.00
స్కిన్ లెస్	210.00

కోడి గుడ్లు (నెక్)	
వంద గుడ్లు	రూ.లలో
విశాఖపట్నం	550
విజయనగరం	554
శ్రీకాకుళం	554

వాన.. వరద

ఉధృతంగా ప్రవహిస్తున్న వరహా, సర్పా, శారదా నదులు

పొంగిపొర్లుతున్న వాగులు, వంకలు

కోటవురట్లలో నీటమునిగిన పంట పొలాలు

ఆందోళన చెందుతున్న రైతులు

కోటవురట్ల, జూలై 21: అల్పపీడనం కారణంగా మండలంలో గత మూడు రోజులు భారీ వర్షాలు కురిశాయి. ఎడతెరిపి లేకుండా పడడంతో నదులు, వాగులు పొంగి పొర్లుతున్నాయి. వీధి రోడ్లు జలమయమయ్యాయి. పంటలు నీట మునగడంతో రైతులు తీవ్ర ఆందోళన చెందుతున్నారు. వరహా, సర్పా నదులు గట్లకు ఆనుకొని ఉరకలేస్తున్నాయి. వరహానది ఉధృతంగా ప్రవహించడంతో దుగ్గాడ కాలువ పరవళ్లు తొక్కుతోంది. నువ్వు, వరి, కాయకూర పంటలకు తీవ్ర నష్టం వాటిల్లింది. పంట చేతికి అందే సమయంలో ప్రకృతి వైపరీత్యం కారణంగా నష్టం వాటిల్లడంతో రైతులు ఆందోళన చెందుతున్నారు. పలు గ్రామాల్లో వరినారు ఎదుగుదల లేకపోవడంతో నీటమునిగింది. కోటవురట్ల మండలం తిమ్మాపురం, కె.వెంకటాపురం, లింగాపురం, కోటవురట్ల, కొడవటిపూడి గ్రామాల్లో పత్తిపంట పొలాల్లోనే తడిసి ముద్దయింది. కె.వెంకటాపురం నుంచి కొడవటిపూడి వెళ్లే దారి మధ్యలో కొండ గెడ్డలు ఉధృతంగా ప్రవహించడంతో రాకపోకలకు ఇబ్బందులు ఎదురవుతున్నాయి. మండలంలో ఆదివారం ఉదయం ఐదు గంటలనుంచి సాయంత్రం మూడు గంటల వరకు 30.4 మిల్లీమీటర్ల వర్షపాతం నమోదైనట్టు తహసీల్దార్ వెంకటరమణ తెలిపారు.



జల్లూరులో నీటమునిగిన కూరగాయల పంటలు



పూడిమడక తీరంలో సురక్షిత ప్రాంతాలకు తరలించిన పడవలు

పూడిమడక తీరంలో పెరిగిన అలల ఉధృతి

» ముందుకు చొచ్చుకు వచ్చిన సముద్రం

అచ్యుతాపురం, జూలై 21: అల్పపీడనం కారణంగా కురిసిన వర్షాలకు అచ్యుతాపురం మండలం పూడిమడక తీరంలో అలల ఉధృతి పెరుగుతుండడంతో మత్స్యకారులు అప్రమత్తమయ్యారు. సముద్రం కూడా ముందుకు చొచ్చుకు రావడంతో పడవలు, వలలను తీరంలోని దూరంగా ఉన్న తమ ఇళ్ల వద్దకు తెచ్చుకున్నారు. తాజా వాతావరణం నేపథ్యంలో బుధవారం నుంచి వీరు వేటకు వెళ్లలేదు. పరిస్థితులు అనుకూలంగా ఉంటే సోమవారం ఉదయం నుంచి వేటకు వెళ్లాలని భావిస్తున్నారు. ఆదివారం రోజంతా మండలంలో ముసురు వాతావరణం నెలకొంది. సాయంత్రం ఐదు గంటల తర్వాత కాస్త తెరిపిచ్చినట్టు కనిపిస్తోంది.

'తాండవ'లో పెరుగుతున్న నీటి నిల్వలు

నాతవరం, జూలై 21: మూడు రోజుల నుంచి కురుస్తున్న వర్షాలకు తాండవ రిజర్వాయర్‌లో నీటినిల్వలు పెరుగుతున్నాయి. తాండవ గరిష్ఠనీటి మట్టం 380 అడుగులు కాగా, ఆదివారం నాటికి తాండవలో 367 అడుగుల నీటినిల్వలకు చేరింది. దీంతో తాండవ ఆయకట్టు రైతుల్లో ఆనందం వ్యక్తం అవుతోంది తాండవ ఎగువప్రాంతాల్లో కురుస్తున్న వర్షాలకు ఇన్‌ఫ్లో ద్వారా తాండవలోకి 2291 క్యూసెక్కుల నీరు వస్తోందని తాండవ డీఈ అనురాధ తెలిపారు. గత ఏడాది జూలై 21 నాటికి తాండవలో 369 అడుగుల నీటినిల్వలు ఉన్నాయి. ఈ వర్షాలకు తాండవలో మరింత నీటినిల్వలు పెరిగే అవకాశాలు ఉన్నాయని అధికారులు తెలిపారు.



నిండు కుండను తలపిస్తున్న తాండవ నది

మా మొర ఆలకించండి ప్రభో..

» అర్ల పంచాయతీలోని 4 గ్రామాల గిరిజనుల మొర

» కనీస సౌకర్యాలు లేక అల్లాడుతున్నామంటూ ఆవేదన

» 27వ తేదీలోగా పరిష్కరించకుంటే కలెక్టరేట్ ఎదుట ధర్నా చేస్తామంటూ హెచ్చరిక




మోకాళ్లపై నిల్చుని వేడుకుంటున్న గిరిజనులు

కొయ్యూరు/రోలుగుంట, జూలై 21: కొయ్యూరు, రోలుగుంట మండలాల్లోని మూలపూట, అర్ల పంచాయతీల శివారు పెదగరువు, పిత్రిగెడ్డ, నీళ్ల బంధ, జాజుల బంధ గ్రామాలకు చెందిన గిరిజనులు తమ సమస్యలు పరిష్కరించాలని కోరుతూ మోకాళ్లపై నిలబడి నిరసన తెలిపారు. తమ గ్రామాలకు కనీస సౌకర్యాలు లేక తీవ్ర ఇబ్బందులు పడుతున్నామని, నీళ్ల బంధ గ్రామానికి ఇప్పటికీ విద్యుత్ సౌకర్యం కూడా లేదని ఆవేదన వ్యక్తం చేశారు. సీపీఎం జిల్లా కార్యవర్గ సభ్యులు కె.గోవిందరావు ఆధ్వర్యంలో ఆదివారం ఉదయం ఈ నాలుగు గ్రామాల గిరిజనులు ఆరు కిలోమీటర్ల మేర పాదయాత్ర చేపట్టారు. అనంతరం గోవిందరావు మాట్లాడుతూ రేషన్ బియ్యం తెచ్చుకోవాలన్నా, అంగన్‌వాడీ సరుకులు, వైద్య సేవలను పొందాలన్నా రానుపోను 18 కిలోమీటర్లు నడవాల్సిందే అన్నారు. ఆయా గ్రామాల్లో 100 కుటుంబాలకు చెందిన 250 మంది పీవీటీజీ తెగకు చెందిన గిరిజనులు నివస్తున్నారని తెలిపారు. వీరు నేటికీ కనీస సౌకర్యాలు లేక దుర్భర స్థితిని అనుభవిస్తున్నారన్నారు. 2021 సంవత్సరంలో కుటుంబానికి 300 చొప్పున చందాలు వేసుకుని అర్ల నుంచి జాజులబంధ వరకు మట్టిరోడ్డును ఏర్పాటు చేసుకున్నారన్నారు. అనేక పోరాటాల ఫలితంగా 2023లో ప్రభుత్వం ఉపాధి హామీ పథకం కింద నిధులు మంజూరు చేసినా పనులు అసంపూర్తిగా నిలిచిపోయాయన్నారు. దీంతె అధికారులు ఆయా గ్రామాలకు వెళ్లలేని పరిస్థితి ఉందన్నారు. ఈ నెల 27లోగా రోడ్డు పనులు ప్రారంభించి పూర్త చేయాలని, లేకుంటే జిల్లా కలెక్టర్ కార్యాలయం ఎదుట నిరసన చేపడతామన్నారు. ఈ కార్యక్రమంలో గిరిజన సంఘం నాయకులు తాంబేలి కొండలరావు, కె.కొండబాబు, కిల్లో నరసయ్య పాల్గొన్నారు.

గరిష్ఠ స్థాయికి పెద్దేరు


సామర్థ్యం 137 మీటర్లు » ప్రస్తుతం 136.40 మీటర్లు



నిండుకుండలా పెద్దేరు జలాశయం

మాడుగుల రూరల్, జూలై 21: మండలంలోని రావిపాలెం పెద్దేరు జలాశయానికి వరదపోటు నెలకొంది. జలాశయం పరిసరాలు, ఏజెన్సీ ప్రాంతాల్లో కురుస్తున్న వర్షాలకు వరదనీరు జలాశయంలోకి వచ్చి చేరింది. దీంతో జలాశయం నీటిమట్టం గరిష్ఠ స్థాయికి చేరింది. గరిష్ఠ నీటిమట్టం 137 మీటర్లు. కాగా ఆదివారం సాయంత్రానికి 500క్యూసెక్కుల ఇన్‌ఫ్లోతో 136.40 మీటర్లకి చేరిందని జలాశయం ఏఈసుధాకర్ రెడ్డి తెలిపారు. ఆదివారం రాత్రి తొమ్మిది గంటలకు 300క్యూసెక్కులు జలాశయం గేటు తెరిచి విడిచిపెడతామని ఆయన తెలిపారు.

నిండు కుండలా కోణాం జలాశయం



కళకళలాడుతున్న కోణాం జలాశయం (ఇన్‌సెట్‌లో) కోణాం జలాశయం స్పిల్‌వే గేట్లు వద్ద చేరిన నీరు

చీడికాడ, జూలై 21: తుపాను ప్రభావంతో గత మూడు రోజులుగా కురుస్తున్న వర్షాలకు కోణాం జలాశయ పరీవాహక ప్రాంతం ద్వారా 350 క్యూసెక్కులు వరద నీరు చేరడంతో జలాశయం గరిష్ఠ స్థాయికి చేరుకుంది. గరిష్ఠ నీటిమట్టం 101.25 మీటర్లు కాగా, ఆదివారం సాయంత్రానికి 99 మీటర్లకు చేరుకుంది. 100 మీటర్లకు ఏ మాత్రం పెరిగినా నీరు విడుదల చేస్తామని అధికారులు తెలిపారు. గత ఏడాది ఇదే రోజుకు 96.70 మీటర్లు వద్ద ఉంది. ఎగువ, దిగువ గేట్లు నుంచి వృథాగా నీరు బొడ్డేరులోకి పోతోంది.

లక్షలు ఖర్చు చేసినా.. మూన్నాళ్లకే మూత!

» రాంబిల్లిలో నిరుపయోగంగా ఫ్యాషన్ టెక్నాలజీ, ఉత్పత్తి కేంద్రం భవనం

» చుట్టూ తుప్పలు పెరగడంతో అడుగు పెట్టలేని దుస్థితి

» గత ప్రభుత్వం పట్టించుకోకపోవడంతో నెరవేరని లక్ష్యం



భవనం చుట్టూ పెరిగిన తుప్పలు



రాంబిల్లిలో నిరుపయోగంగా ఉన్న ఫ్యాషన్ టెక్నాలజీ, ఉత్పత్తి కేంద్రం భవనం

రాంబిల్లి, జూలై 12: మండల కేంద్రం రాంబిల్లి సమీపంలోని కొండ ప్రాంతంలో నిర్మించిన ఫ్యాషన్ టెక్నాలజీ, ఉత్పత్తి కేంద్రం భవనం నిరుపయోగంగా మారింది. ప్రస్తుతం దీని చుట్టూ పిచ్చిమొక్కలు పెరిగిపోవడంతో అడుగుపెట్టలేని విధంగా తయారైంది. కొన్నేళ్ల క్రితం అప్పటి ప్రభుత్వం స్వర్ణ జయంతి గ్రామ సరోజ్‌గార్ యోజన పథకంలో భాగంగా జిల్లా గ్రామీణాభివృద్ధి సంస్థ లక్షలాది రూపాయలు వెచ్చించి ఈ భవనాన్ని ఇక్కడ నిర్మించింది. అప్పట్లో ఈ భవనం కొంతకాలం పాటు నిరుపయోగంగా ఉండేది. దీంతో ఓ ప్రైవేటు వ్యక్తి ఇందులో ఫ్యాషన్ టెక్నాలజీని ఏర్పాటు చేశారు. రాంబిల్లి పరిసర ప్రాంతాలకు చెందిన నిరుద్యోగ యువతీ, యువకులు ఇందులో పనిచేశారు. ఇది కూడా కొద్ది రోజులు మాత్రమే పనిచేసింది. ఈ తరువాత మూతపడడంతో భవనం పూర్తిగా నిరుపయోగంగా ఉంది. దీనిని పట్టించుకునేవారు లేకపోవడంతో మందుబాబులకు అడ్డాగా మారింది. లక్షలాది రూపాయలు వెచ్చించి నిర్మించిన భవనాన్ని ఇలా నిరుపయోగంగా వదిలేయడంపై పలువురు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ఇక్కడి ఫ్యాషన్ టెక్నాలజీ, ఉత్పత్తి కేంద్రాన్ని వినియోగంలోకి తీసుకు రావాలని గత ప్రభుత్వాలు కనీస ఆలోచన చేయలేకపోవడం వల్లే ఈ పరిస్థితి ఏర్పడిందని అంటున్నారు. ఉన్నతాధికారులు దీనిపై ఇప్పటికైనా స్పందించాల్సిందిగా అంతా కోరుతున్నారు.

పెరిగిన శారదా నది ఉధృతి



అనకాపల్లిలో ఉధృతంగా ప్రవహిస్తున్న శారదానది

అనకాపల్లి టౌన్, జూలై 21: శారదానది ఇక్కడ ఉధృతంగా ప్రవహిస్తుంది. రెండు రోజుల క్రితం వరకు సాధారణ నీటి ప్రవాహంతో ఉన్న నది ఆదివారం నిండుకుండలా మారింది. ఘాట్ నిండిపోవడంతో పాటు మెట్ల వద్దకు నీరు చేరింది. అనకాపల్లిలోనే కాకుండా ఎగువ ప్రాంతాల్లో భారీ వర్షాలు కురియడంతో పాటు రిజర్వాయర్ల గేట్లు ఎత్తడంతో వరదనీరు నదిలోకి చేరడంతో నీటి ఉధృతి పెరిగింది.

భారీ వర్షాలకు నిండిన జలాశయాలు



ఏఎల్‌పురం వర్షాలకు పొంగిప్రవహింస్తున్న బొడ్డేరుగెడ్డ

కృష్ణాదేవిపేట, జూలై 21: భారీ వర్షాలకు బొడ్డేరు, గెడ్డలు, చెరువులు నీటితో కళకళలాడుతున్నారు. ఆదివారం తెల్లవారుజాము నుంచి ఎడతెరపి లేకుండా ఏఎల్‌పురం, చోద్యం, కొంగసింగి, నాగాపురం, పాతకృష్ణాదేవిపేట తదితర గ్రామాల్లో భారీ వర్షం పడింది. రహదారుల మధ్యలో ఉన్న గోతుల్లో వర్షం నీరు చేరటంతో వాహనదారులు ఇబ్బంది పడుతున్నారు. రైతులు ట్రాక్టర్లతో వరినాట్లు వేసేందుకు దమ్ములు ప్రారంభించారు.

చదరంగం పోటీల విజేతలకు బహుమతులు



విజేతలకు బహుమతులు అందిస్తున్న దృశ్యం

అనకాపల్లి టౌన్, జూలై 21: జిల్లా చెస్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఆదివారం ఇక్కడి సాయి శక్తి టెక్నో స్కూల్‌లో జిల్లాస్థాయి చదరంగం పోటీలు నిర్వహించారు. వివిధ ప్రాంతాల నుంచి ఇరవై మంది క్రీడాకారులు హాజరయ్యారు. అండర్-11 బాలుర విభాగంలో ఎం.లిఖిత్ (పరవాడ), శివధీరజ్ (అనకాపల్లి) ప్రథమ, ద్వితీయ బహుమతులు గెలుచుకున్నారు. బాలికల విభాగంలో సహస్ర (ఎస్.రాయవరం), గీతికా శ్రీ (అనకాపల్లి) ప్రథమ, ద్వితీయ బహుమతులు సాధించినట్టు అసోసియేషన్ అధ్యక్షుడు వెంకటేశ్వరరావు తెలిపారు. వీరంతా ఈ నెల 27,28 తేదీల్లో భీమవరంలో జరిగే రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికైనట్టు చెప్పారు. విజేతలకు స్కూల్ కరస్పాండెంట్ అన్నం రాజశేఖర్, శ్రీదివ్య బహుమతులు అందజేశారు. ఈ కార్యక్రమంలో అసోసియేషన్ ప్రతినిధులు వుడా రాము, గురుమూర్తి, కోచ్ రామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

ఏఎల్‌పురంలో విరబూసిన బ్రహ్మకమలాలు



కృష్ణాదేవిపేట, జూలై 21: హిమాలయాల్లో పూసె బ్రహ్మకమలాలు ఏఎల్‌పురంలోని ఎస్.వాసు మాష్టారు ఇంటి పెరట్లో కనువిందు చేస్తున్నాయి. శివుడికి ఎంతగానో ఇష్టమైన ఈ పుష్పాలు ఏడాదిలో ఒకసారి మాత్రమే పూస్తాయి. పలువురు భక్తులు పూజలు చేస్తారు. వాసు మాస్టారు ఇంట్లో పూచిన ఈ పుష్పాలను చూసి స్థానికులు మురిసిపోతున్నారు.

అసెంబ్లీ సమావేశాల డుమ్మాకే జగన్ ఢిల్లీ ధర్నా

» మాజీ మంత్రి దాడి వీరభద్రరావు



అనకాపల్లి టౌన్, జూలై 21: పదవి పోయిన నాటి నుంచి తేరుకోలేని జగన్మోహన్ రెడ్డి రాష్ట్రంలో ఏకంగా రాష్ట్రపతి పాలన పెట్టాలని పార్లమెంట్‌లో డిమాండ్ చేయమని తన ఎంపీలకు ఆదేశాలు జారీ చేయడం హాస్యాస్పదంగా ఉందని మాజీ మంత్రి దాడి వీరభద్రరావు అన్నారు. ఆదివారం ఇక్కడి తన కార్యాలయంలో విలేకరుల సమావేశంలో మాట్లాడారు. తాను సింహం అని, ఒంటరిగానే పోటీ చేస్తానని ప్రగల్భాలు పలికిన జగన్‌కు ఇప్పుడు ఇతర రాజకీయ పార్టీలు జ్ఞాపకం వచ్చాయా.. అని ప్రశ్నించారు. ఢిల్లీలో తలపెట్టిన ధర్నాకు తనతో కలిసి రమ్మని ప్రాధేయపడుతున్నారన్నారు. సోమవారం నుంచి జరగబోయే శాసనసభ సమావేశాల్లో రాష్ట్ర సమస్యలు గురించి చర్చించే అవకాశం వదులుకుని సమావేశాలకు డుమ్మా కొట్టడానికే 24న ఢిల్లీలో ధర్నా కార్యక్రమం పెట్టారని పేర్కొన్నారు. రాజభోగాలకు అలవాటుపడిన జగన్ ప్రతిపక్షంలో కూర్చోలేరన్నారు. తన పాలన పట్ల విపరీతమైన కక్షతో, అసహ్యంతో ప్రజలు అతి దారుణంగా ఓడిస్తే అందుకు కారణం తెలుసుకోవడానికి బదులు జగన్ హిమాలయాలకు వెళ్లిపోవాలని అనుకున్నారని ఎద్దేవా చేశారు. హుందాగా ప్రవర్తించి రాష్ట్ర ప్రజలు ఇచ్చిన చారిత్రాత్మక తీర్పును ఢిల్లీ వీధుల్లో పరిహాసం చేయవద్దని వీరభద్రరావు ఆయనకు హితవు పలికారు.

ఓ గిరిజనుడు ఖాతాలో నగదు చోరీ

గూడెంకొత్తవీధి, జూలై 21: మండలంలోని మొండిగెడ్డ పంచాయతీ తోటలగంది గ్రామానికి చెందిన కందుల మనోహర్‌నాథ్ ఖాతాలో నగదును సైబర్ నేరగాళ్లు దోచుకున్నారు. రెండు రోజుల క్రితం బ్యాంక్ ఉద్యోగినంటూ ఓ అజ్ఞాత వ్యక్తి కాల్ చేసి హిందీలో మాట్లాడడంతో హర్‌నాథ్ కాల్ కట్ చేసేశాడు. అయితే అతని మొబైల్‌కు రెండు ఓటీపీలు వచ్చాయి. వెంటనే రూ.9,600 డెబిట్ అయినట్టు మరో మెసేజ్ వచ్చింది. బ్యాంక్‌కు వచ్చి మినీ స్టేట్‌మెంట్ తీసుకోగా నగదు డెబిట్ అయినట్టు చూపడంతో బాధితుడు పోలీసులకు ఫిర్యాదు చేశాడు.


కొయ్యూరు: వరద నీటికి కొట్టుకుపోయిన పాడి-రత్నంపేట వంతెన


జి.మాడుగుల: పలుసుమామిడి గ్రామంలో చెరువులు తలపిస్తున్న పంట పొలాలు


భారీ వర్షంతో వెలవెలబోయిన సీలేరు వారపు సంత

వదలని వర్షం.. జన జీవనానికి అంతరాయం

జిల్లాను వాన వదలడం లేదు. మూడు రోజులుగా కురుస్తున్న ఎడతెరిపిలేని వర్షాలతో గెడ్డలు, వాగులు పొంగి ప్రవహిస్తున్నాయి. కొన్ని చోట్ల వంతెనలు, కాజ్‌వేలు కొట్టుకుపోయాయి. రహదారులు కోతకు గురయ్యాయి. చాలా గ్రామాలు జల దిగ్బంధంలోనే ఉన్నాయి. పంట పొలాల్లోకి వర్షం నీరు చేరడంతో చెరువులను తలపిస్తున్నాయి. దీంతో జన జీవనానికి తీవ్ర అంతరాయం ఏర్పడుతోంది.

వరద నీటి ఉధృతికి కొట్టుకుపోయిన వంతెనలు, కాజ్‌వేలు
రహదారులకు కోతలు.. ఎక్కడికక్కడే కూలిపోయిన చెట్లు
మూడు రోజులుగా గిరిజనులకు తప్పని కష్టాలు

కొయ్యూరు, జూలై 21: మండలంలో వర్షం ఉధృతి ఉధృతి తగ్గలేదు. శనివారం చిరుజల్లులతో సరిపుచ్చిన వాన, ఆదివారం తెల్లవారు జాము 3 గంటల నుంచి పునఃప్రారంభమై రోజంతా భారీగా పడింది. దీంతో జనజీవనం స్తంభించిపోయింది. పలు గ్రామాల ప్రజలకు కష్టాలు తప్పడం లేదు. జాతీయ రహదారి నిర్మాణాలలో భాగంగా పెదమాకవరం-నడింపాలెం, రామరాజులపాలెం వద్ద నిర్మించిన తాత్కాలిక వంతెనలు కొట్టుకుపోయాయి. దీంతో ఈ రహదారి ఆధారంగా ఉన్న 30 గ్రామాలకు కష్టాలు తప్పలేదు. అత్యవసరాలకు వచ్చేందుకు అవకాశం లేక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. శరభన్నపాలెం వద్ద కొండవాగు ప్రవాహ ఉధృతి పెరగడంతో కంపరేగుల, బట్టుమెట్ట గ్రామాలకు బాహ్య ప్రపంచంతో సంబంధాలు తెగిపోయాయి. వెలగలపాలెం, శరభన్నపాలెం, నడింపాలెంకు చెందిన రైతులువ్యవసాయ పనులకు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. కాకరపాడు, శింగవరం ఐటీడీఏ కాలనీ వద్ద వాగులు పొంగి ప్రహిస్తుండడంతో రెండో రోజు మండల కేంద్రానికి రాకపోకలు నిలిచిపోయాయి. యు.చీడిపాలెం పంచాయతీలో సుమారు 30 గ్రామాలకు వెళ్లే రహదారులకు అడ్డంగా బండి గెడ్డ పొంగి ప్రవహిస్తుండడంతో బాహ్య ప్రపంచంతో సంబంధాలు తెగిపోయాయి.

అలాగే పాడి-రత్నంపేట గ్రామాల మధ్య కొండవాగు ప్రవాహంపై నిర్మించిన వంతెన కొట్టుకుపోయింది. దీంతో వంతెన అవతల ఉన్న పాడి, కొత్తపాడి, రామ్‌నగర్, జి.కొత్తూరుతో పాటు బాలారం ఆపై ఉన్న మరికొన్ని గ్రామాలకు రాకపోకలు నిలిచాయి. కనీసం నడిచి వెళ్లే పరిస్థితి లేక వారంతా ఇబ్బందులు పడుతున్నారు.

కూలిన భారీ వృక్షం.. 108 సేవలకు ఆటంకం

జువ్విరేవుల గ్రామానికి సమీపంలో భారీ వృక్షం రోడ్డుకు అడ్డంగా కూలిపోవడంతో 108 సేవలకు ఆటంకం ఏర్పడింది.


భారీ వృక్షం కూలడంతో నిలిచిపోయిన 108 వాహనం

కన్నవరం గ్రామానికి చెందిన గర్భిణి పాంగి నందిని ప్రసవానికి తరలించేందుకు కుటుంబీకులు 108కు సమాచారం ఇచ్చారు. వాహనం వస్తుండగా రోడ్డుకు అడ్డంగా చెట్టు పడిపోయింది. దీన్ని తొలగించేందుకు అందుబాటులో ఎవరూ లేక వాహనాన్ని వెనక్కు మళ్లించారు. అప్పటికే ప్రసవ వేదనతో ఉన్న గర్భిణిని జీపులో తీసుకువస్తుండగా, బాలరేవుల వద్ద 108 సిబ్బంది గర్భిణికి ప్రథమ చికిత్స అందించి రాజేంద్రపాలెం పీహెచ్‌సీకి తరలించారు. పది నిమషాలలో పండంటి ఆడబిడ్డకు నందిని జన్మనిచ్చింది. తల్లీబిడ్డ క్షేమంగా ఉండడంతో కుటుంబీకులు 108 సిబ్బంది కృతజ్ఞతలు తెలిపారు.


ముంచంగిపుట్టు మండలం కరిముఖిపుట్టు ప్రధాన రహదారిపై పడిన చెట్టును తొలగిస్తున్న స్థానిక ప్రజలు

చింతపల్లిలో...

చింతపల్లి: మండలంలో ఆదివారం భారీ వర్షం కురిసింది. రాత్రి వరకు ఎడతెరిపి లేకుండా వాన పడడంతో ప్రధాన రహదారులు వాగులను తలపిస్తున్నాయి. చెరువులు, లోతట్టు ప్రాంతాలకు వర్షపు నీరు చేరుకున్నది. చెరువూరు, చౌడుపల్లి, పెద్దగెడ్డ, తాజంగి వాగులు ఉధృతంగా ప్రవహిస్తున్నాయి. లోతుగెడ్డ పంచాయతీ చెరపల్లి గ్రామంలో వర్షానికి ఓ గృహం పాక్షికంగా దెబ్బతింది. మూడు రోజులుగా కురుస్తున్న వర్షాలకు చెరపల్లి గ్రామానికి చెందిన గెమ్మెలి చిన్నమ్మి, చిన్నగెడ్డ గ్రామంలో కొండేజి లక్ష్మి గృహాల గోడలు కూలిపోయాయి.

ముంచంగిపుట్టులో...

ముంచంగిపుట్టు: మండల పరిధిలో ఆదివారం కురిసిన భారీ గాలివానకు జన జీవనం అస్తవ్యస్తంగా మారింది. మండల కేంద్రం నుంచి కుమడ వెళ్లే మార్గ మధ్యంలోని కరిముఖిపుట్టు సమీపంలో పీఆర్ ప్రధాన రహదారిపై భారీ వృక్షం పడింది. దీంతో పెదబయలు, ముంచంగిపుట్టు మండలాలకు చెందిన సుమారు ఆరు పంచాయతీల ప్రజల రాకపోకలు మూడు గంటల పాట& స్తంభించిపోయాయి. స్థానిక నాయకుడు అర్జున్, పంచాయతీ కార్యదర్శి చిన్నాన్న, వీఆర్వో పద్మారావు, సచివాలయ కన్వీనర్ రాంప్రసాద్, ఉద్యోగులు రెండు గంటల పాటు శ్రమించి వృక్షాన్ని తొలగించడంతో మార్గం సుగమమైంది. అలాగే 23 పంచాయతీల పరిధిలో వాగులు, మత్స్యగెడ్డ పాయలు ఉధృతంగా ప్రవహిస్తున్నాయి. పలు గ్రామాల్లో వరి పంట పొలాలు దెబ్బతిన్నాయి. శనివారం రాత్రి విద్యుత్ వైర్లు తెగిపోవడంతో మండల కేంద్రంతో పాటు పలు గ్రామాలకు విద్యుత్ సరఫరా లేదు.

డుంబ్రిగుడలో...

డుంబ్రిగుడ: మండలంలో భారీ వర్షాలకు గోరపూర్ వంతెన కోతకు గురైంది. కితలంగి రోడ్డులో కోసంగుడ వంతెన కొట్టుకుపోయింది. గెడ్డలు పొంగడంతో పెదపాడు, కితలంగి, కించుమండ, కోసంగి ప్రాంతాల గిరిజనులకు రాకపోకలు స్తంభించాయి. మూడు రోజులుగా పెదపాడు గ్రామస్థులు తాళ్ల సాయంతో చాపరాయి గెడ్డ దాటుతున్నారు.

జి.మాడుగులలో..

జి.మాడుగుల: మండలంలోని ఎడతెరిపిలేని వర్షాలకు వాగులు పొంగిపొర్లుతున్నాయి. రహదారులు జలమయమయ్యాయి. పంట పొలాలు నీట మునిగాయి. లోతట్టు ప్రాంతాలు జల దిగ్బంధంలో చిక్కుకుని జన జీవనానికి అంతరాయం ఏర్పడుతోంది. మద్దిగరువు రహదారిలో సూరిమెట్ట కల్వర్టు, కుంబిడిసింగి రహదారిలో అండంగిసింగి, రాళ్లగెడ్డ వంతెనలపై రాకపోకలు స్తంభించాయి.

సీలేరులో...

సీలేరు: సీలేరు, ధారకొండల్లో కుండపోత వర్షం కురిసింది. మారుమూల గ్రామాల్లో గెడ్డలు, వాగులు పొంగి ప్రవహిస్తుండడంతో మారుమూల గ్రామాల గిరిజనులతో పాటు మైదాన ప్రాంత వ్యాపారులు, రైతులు కూడా రాకపోవడంతో వారపు సంతలకు రాకపోవడంతో వెలవెలబోయాయి.

నేటి నుంచి శిక్ష సప్తాహ్ వారోత్సవాలు

జిల్లా విద్యా శాఖాధికారి బ్రహ్మాజీరావు

పాడేరు రూరల్, జూలై 21: జిల్లాలోని అన్ని పాఠశాలల్లో సోమవారం నుంచి శిక్షా సప్తాహ్ వారోత్సవాల నిర్వహణకు ఏర్పాట్లు పూర్తి చేశామని జిల్లా విద్యా శాఖాధికారి పి.బ్రహ్మాజీరావు తెలిపారు. ఆదివారం విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ సమగ్ర శిక్షా ఆధ్వర్యంలో వారం రోజులు నిర్వహిస్తున్న ఈ కార్యక్రమంలో విద్యార్థులు, ఉపాధ్యాయులు, స్థానిక ప్రజలు భాగస్వాములు కావాలని కోరారు. ఇందులో భాగంగా బుధవారం ఉపాధ్యాయులు స్థానిక వనరులతో బోధన అభ్యాసన సామగ్రి తయారుచేసి ప్రదర్శించడం జరుగుతుందన్నారు. కార్యక్రమంలో విద్యార్థుల తల్లిదండ్రులు, స్థానిక పెద్దలు భాగస్వాములవుతారన్నారు. అలాగే 23న పునాది అభ్యాసన, సంఖ్యా శాస్త్ర నైపుణ్యాల అభివృద్ధి కార్యక్రమం, 24న క్రీడా, 25న సాంస్కృతిక దినోత్సవాలు నిర్వహిస్తామన్నారు. అలాగే 26న సాంకేతిక నైపుణ్యాల దినోత్సవం, 27న పర్యావరణ పరిరక్షణ సంకల్పయాత్ర కృత్యాలు, పాఠశాలలో పోషణ దినోత్సవ నిర్వాహణ, కొత్త ఎకో క్లబ్‌లు ఏర్పాటు, విద్యార్థులు, వారితల్లిదండ్రులు మాతృభూమి మధ్య సంబంధాన్ని బలోపేతం చేయడంపై అవగాహన కార్యక్రమాలను చేపడతామన్నారు. 28వ తేదీన సామాజిక భాగస్వామ్య దినోత్సవం, పాఠశాల విద్యార్థినీ, విద్యార్థులతో కలిసి సహపంక్తి భోజనం చేయడం వంటివి నిర్వహించేలా ప్రణాళిక రూపొందించామన్నామన్నారు. ఈ కార్యక్రమాలను విజయవంతం చేసేందుకు అన్ని పాఠశాలల ఉపాధ్యాయులు కృషి చేయాలని డీఈవో సూచించారు.


సమావేశంలో మాట్లాడుతున్న డీఈవో బ్రహ్మాజీరావు

ముంపు ప్రాంతాల ప్రజల రక్షణకు చర్యలు: ఎస్పీ

పాడేరు రూరల్, జూలై 21: అల్పపీడన ద్రోణి ప్రభావం వల్ల కురుస్తున్న భారీ వర్షాల కారణంగా ప్రజలను కాపాడేందుకు, అవసరమైన సహాయ సహకారాలు అందించేందుకు పోలీసు శాఖ ముందస్తు చర్యలు చేపడుతున్నదని జిల్లా ఎస్పీ అమిత్ బర్దర్ ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. పోలవరం ప్రాజెక్టు నీటి మట్టం ఆదివారం సాయంత్రం 43 అడుగులకు చేరినందు వల్ల ముంపు గ్రామాల ప్రజలు ప్రభుత్వం ఏర్పాటు చేసిన పునరావాస కేంద్రానికి వెళ్లాలని సూచించారు. ముంపు గ్రామాల నిర్వాసితులకు పునరావాస కేంద్రాలను నందిగామ, ఎటపాక మండలానికి గాను ఎంపీపీ స్కూల్ చల్లంపాలెం, మరుమూరు గ్రామానికి ఎంపీపీ స్కూల్ మరుమూరు, నందిగామ గ్రామానికి చల్లంపాలెం క్రైస్తవ చర్చ్, వీరయ్యగూడెం, నెల్లిపాక గ్రామాలకు జీపీహెచ్ స్కూల్ నల్లకుంట, కూనవరం మండలానికి కోతులగుట్ట ఏపీఆర్ స్కూల్, కేజీబీవీ స్కూల్, వీఆర్.పునానికి రేఖపల్లి మినీ గురుకులం, కేజీబీవీ స్కూల్, చింతూరు గ్రామస్థులు ఏపీఆర్ స్కూల్ బాలురు, బాలికల పాఠశాలలను ఏర్పాటు చేశామన్నారు. ప్రతీ పోలీసు స్టేషన్‌లో స్పెషల్ పోలీస్ బృందాలను రెస్క్యూ టీంగా ఏర్పాటు చేశామన్నారు. సహాయక చర్యలకు డ్రాగన్ లైట్స్, రోప్స్, లైఫ్ జాకెట్స్ సిద్ధం చేశామని చెప్పారు. ముంపు గ్రామ ప్రజలను రక్షించేందుకు ఆరు టూరిజం బోట్లు, 20 నాటు పడవలను సిద్ధం చేసినట్టు ఎస్పీ వివరించారు. అరకు, పాడేరు, మారేడుమిల్లు, చింతూరు ఘాట్ రోడ్లలో సాయంత్రం 7 గంటల నుంచి మరుసటి రోజు ఉదయం 6 గంటల వరకు వాహనాలను నిలిపివేసి ప్రయాణికులను నిషేధిస్తూ కలెక్టర్ ఉత్తర్వులు జారీ చేశారని, ఆ మేరకు వాహనాలను నిలుపుదల చేస్తున్నామని చెప్పారు. ఈ విషయంలో ప్రజలు సహాయ సహకారాలు అందించాలని ఎస్పీ కోరారు.

ఐస్‌గెడ్డ జలపాతంలో పర్యాటకుల సందడి


ఐస్‌గెడ్డ జలపాతం వద్ద సందడి చేస్తున్న పర్యాటకులు

సీలేరు, జూలై 21: సీలేరు ఐస్‌గెడ్డ జలపాతం వద్ద ఆదివారం పర్యాటకులు సందడి చేశారు. కొంత కాలంగా ఈ జలపాతం నీరు లేక వెలవెల బోయింది. అల్పపీడన ప్రభావంతో ఈ ప్రాంతంలో కురుస్తున్న భారీ వర్షాలకు ఐస్‌గెడ్డ జలపాతం వంద అడుగుల ఎత్తు నుంచి కిందకు పాల నురుగుల వలే జాలువారుతూ కనువిందు చేస్తోంది. ఈ జలపాతం సీలేరుకు వచ్చే ప్రధాన రహదారికి పక్కనే ఉండడంతో ధారాలమ్మ అమ్మవారి దర్శనానికి, తెలంగాణ ప్రాంతాల నుంచి అరకు, లంబసింగి, భద్రాచలం తదితర ప్రాంతాలకు వెళ్లే వారంతా ఇక్కడ కాసేపు ఆగి ఐస్‌గెడ్డ అందాలను చూసి తమ సెల్ ఫోన్లతో సెల్ఫీలు దిగి ఫిదా అవుతున్నారు.

ఘనంగా గురు పౌర్ణమి వేడుకలు

పాడేరు రూరల్/ముంచంగిపుట్టు/చింతపల్లి/సీలేరు/జి.మాడుగుల, జూలై 21: మన్యంలోని పలు మండలాల్లో గురు పౌర్ణమి వేడుకలను ఆదివారం ఘనంగా నిర్వహించారు. పాడేరు మండలంలోని కిండంగి పంచాయతీ సేరుబయలు గ్రామంలోని సాయిబాబా ఆలయంలో దైవ భక్తులు ప్రత్యేక పూజలను చేపట్టారు. ఈ సందర్భంగా ఆలయ ప్రాంగణంలో అన్న సమారాధన ఏర్పాటు చేశారు. పాడేరుకు చెందిన మోద మణికంఠ అన్నదాన ట్రస్ట్ చైర్మన్ శివరాత్రి శ్రీనివాస్ కుమార్, కమిటీ ప్రతినిధులు సురేష్‌కుమార్, ముకుందరావు, కొండలరావు బాబా ఆలయంలో ప్రసాదం పంపిణీ చేశారు. సాయంత్రం 5 గంటల నుంచి సాయిబాబాను సేరిబయలు, నక్కలపుట్టు, కిండంగి గ్రామాల్లో ఊరేగింపు నిర్వహించారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు బొర్రా నాగరాజు, విజయరాణి, భక్తులు పాల్గొన్నారు. చింతపల్లి, మండల కేంద్రంలో మెహర్‌బాబు, సాయిబాబా ఆలయాల్లో ప్రత్యేక పూజలు జరిగాయి. మెహరబాబా ఆలయంలో కమిటీ సభ్యులు, సాయిబాబా ఆలయంలో జీసీసీ సేల్స్‌మన్ చల్లంగి క్రిష్ణారావు దంపతులు అన్నదాన కార్యక్రమం ఏర్పాటు చేశారు. వర్తక సంఘం అధ్యక్ష, ప్రధాన కార్యదర్శిలు జోగేశ్వరరావు, పెడిరెడ్ల బేతాళుడు, నాయకులు బంగారయ్యశెట్టి, రమేశ్ పాల్గొన్నారు. ముంచంగిపుట్టు సాయిబాబా ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఉద్యోగ, ఉపాధ్యాయులు, వ్యాపారులు, వర్తకులు, ప్రజాప్రతినిధులు, భక్తుల ఆర్థిక సాయంతో అన్నసంతర్పణ నిర్వహించారు. జి.మాడుగుల సద్గురు సాయి ఆలయంలో ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం ఆలయ ప్రాంగణంలో అన్నసమారాధన కార్యక్రమం ఏర్పాటు చేశారు. నిర్వాహకులు రమణ, వి.శ్రీనివాసరావు, కె.సత్యనారాయణ, వరుణ్ పాల్గొన్నారు. సీలేరు షిరిడీసాయి ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం ఆలయ ప్రాంగణంలో ఆలయ కమిటీ ఆధ్వర్యంలో అన్నసమారాధన ఏర్పాటు చేశారు.


కిండంగి పంచాయతీ సేరుబయలులో పూజలు అందుకున్న సాయిబాబా

కొనసాగుతున్న గెడ్డల ఉధృతి

... 5వ పేజీ తరువాయి

చెరపల్లి, చిన్నగెడ్డ గ్రామాల్లో వర్షానికి రెండు ఇళ్లు కూలిపోగా, ఐదు ఇళ్లు పాక్షికంగా దెబ్బతిన్నాయి.

కొయ్యూరు మండలంలో వాగులు, గెడ్డలు ఉధృతంగా ప్రవహిస్తున్నాయి. పెదమాకవరం, రామరాజులపాలెం తాత్కాలిక వంతెనలు కొట్టుకుపోవడంతో 30 గ్రామాల ప్రజలు ఇబ్బంది పడుతున్నారు. కాకరపాడు, శింగవరం ఐటీడీఏ కాలనీ వద్ద వాగులు పొంగి ప్రహిస్తుండడంతో రెండో రోజు మండల కేంద్రానికి రాకపోకలు నిలిచాయి. యు.చీడిపాలెం పంచాయతీలో బండి గెడ్డ పొంగి ప్రవహిస్తుండడంతో 30 గ్రామాలకు సంబంధాలు తెగిపోయాయి.

జి.మాడుగుల మండలంలోని వాగులు, వంకలు పొంగిపొర్లుతున్నాయి. వరద ఉధృతికి మద్దిగరువు రహదారిలో సూరిమెట్ట కల్వర్టు, కుంబిడిసింగి రహదారిలో అండంగిసింగి, రాళ్లగెడ్డ వంతెనల వద్ద గెడ్డలు ప్రమాద స్థాయిలో ప్రవహించడంతో రాకపోకలు నిలిచిపోయాయి.

డుంబ్రిగుడ మండలంలో నూతనంగా నిర్మించిన సరాయిరోడ్డు గోరపూర్ వంతెన అప్రోచ్ రోడ్డు కోతకు గురైంది. కితలంగి రోడ్డు కోసంగుడ వంతెన కొంతభాగం కొట్టుకుపోయింది. గెడ్డలు పొంగి ప్రవహిస్తుండడంతో పెదపాడు, కితలంగి, కించుమండ, కోసంగి ప్రాంతాలకు రాకపోకలు నిలిచిపోవడంతో నిత్యావసర సరకులు కోసం గిరిజనులు ఇబ్బందులు పడుతున్నారు.

ముంచంగిపుట్టు మండలం కుమడ వెళ్లే మార్గంలో కరిముఖిపుట్టు సమీపంలో రహదారిపై భారీ వృక్షం పడడంతో పెదబయలు, ముంచంగిపుట్టు మండలాలకు చెందిన ఆరు పంచాయతీలకు మూడు గంటల పాటు రాకపోకలు నిలిచిపోయాయి. అనంతరం వృక్షాన్ని తొలగించడంతో రాకపోకలు ప్రారంభమయ్యాయి. పలు గ్రామాల్లో వరి పొలాలు దెబ్బతిన్నాయి. శనివారం రాత్రి పెదగూడ వెళ్లే విద్యుత్ వైర్లు మండల కేంద్రంలో తెగిపోవడంతో మండల కేంద్రంతో పాటు పలు గ్రామాలకు రాత్రి విద్యుత్ సరఫరా లేదు. ఉదయం విద్యుత్ సరఫరాను పునరుద్ధరించారు.

పులకించిన సింహగిరి

... 5వ పేజీ తరువాయి

చెందిన ఆధ్యాత్మికవేత్త లక్ష్మీకాంత్ నాయక్ దాసుడి బృందం పులిహోర, సింహగిరి వర్తకుల సంఘం ఆధ్వర్యంలో పొంగలి ప్రసాదాలను వితరణ చేశారు. ఈవో సింగాల శ్రీనివాసమూర్తి, కలెక్టర్ హరేందిర ప్రసాద్, నగర పోలీస్ కమిషనర్ శంఖబ్రత బాగ్చీ, తదితరులు భక్తులకు అసౌకర్యం కలగకుండా ఉత్సవం విజయవంతం కావడానికి కృషి చేశారు.

సేవలందించిన 45 ఆర్టీసీ బస్సులు

దేవస్థానం సుమారు రూ.10 లక్షలు చెల్లించి 45 ఆర్టీసీ బస్సులను భక్తుల రాకపోకలకు వినియోగించింది. అవన్నీ రద్దీగా మారడంతో కొందరు ఘాట్‌రోడ్డులో కాలినడకన రాకపోకలు సాగించారు. తొలిపావంచా వద్ద భక్తులు లక్షలాదిగా కొబ్బరికాయలను కొట్టి ప్రదక్షిణలను ప్రారంభించడంతో టన్నుల కొద్దీ కొబ్బరిముక్కలు పోగయ్యాయి. గత ఏడాది అనుభవాన్ని దృష్టిలో పెట్టుకుని కాంట్రాక్టర్ వ్యాన్‌లు ఏర్పాటు చేసి, జేసీబీ సాయంతో వాటిని ఎప్పటికప్పుడు తరలించారు.

అసెంబ్లీలో గిరిజన సమస్యలు ప్రస్తావిస్తా: ఎమ్మెల్యే

పాడేరు, జూలై 21 (ఆంధ్రజ్యోతి): గిరిజన ప్రాంత సమస్యలను అసెంబ్లీ ప్రస్తావిస్తానని ఎమ్మెల్యే మత్స్యరాస విశ్వేశ్వరరాజు చెప్పారు. తన కార్యాలయంలో ఆదివారం నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. ప్రధానంగా జీవో నంబర్-3 పునరుద్ధరణ, అపిడమిక్ సీజన్‌లో పటిష్ట చర్యలు చేపట్టడం, గిరిజనులు రోగాల బారినపడకుండా చూడాలని కోరతామన్నారు. అలాగే జీవో-3ను పునరుద్ధించి గిరిజనులకు న్యాయం చేస్తామని ఎన్నికలకు ముందు అరకులోయలో జరిగిన బహిరంగ సమావేశంలో సీఎం చంద్రబాబు హామీ ఇచ్చారని, దాన్ని కచ్చితంగా అమలు చేసి గిరిజనులకు న్యాయం చేయాలని కోరుతామన్నారు. అలాగే ఆలయ కమిటీ చైర్మన్‌గా వ్యవహరించే ఎమ్మెల్యే ఆధ్వర్యంలోనే అందరి సమన్వయంతో ఆలయ కమిటీ నియామకం జరుగుతుందని ఆయన స్పష్టం చేశారు. అతని వెంట వైసీపీ నేతలు కె.కోటినాయుడు, రాంబాబు తదితరులు ఉన్నారు.


విలేకరులతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే విశ్వేశ్వరరాజు

సీజనల్ వ్యాధులపై అప్రమత్తంగా ఉండాలి

» టీడీపీ నియోజకవర్గ ఇన్‌చార్జి గిడ్డి ఈశ్వరి



పాడేరు రూరల్, జూలై 21: మన్యంలో భారీ వర్షాలు కురుస్తున్న నేపథ్యంలో ప్రజలు వాగులు, గెడ్డలు దాటే సమయంలో, సీజనల్‌గా వచ్చే వ్యాధులపై అప్రమత్తంగా ఉండాలని టీడీపీ నియోజకవర్గ ఇన్‌చార్జి గిడ్డి ఈశ్వరి కోరారు. ఆదివారం ఆమె విలేకరులతో మాట్లాడుతూ గెడ్డలు, వాగులు పొంగి ప్రవహిస్తున్న నేపథ్యంలో అత్యవసర పరిస్థితుల్లో ప్రయాణాలు సాగించే ప్రజలు తగిన జాగ్రత్తలను తీసుకోవాలన్నారు. భారీ వర్షాల నేపథ్యంలో పంటలు నష్టపోయిన రైతులు పంట వివరాలను సంబంధిత అధికారులకు సమాచారం ఇవ్వాలని సూచించారు. పంటలు నష్టపోయిన గిరి రైతులకు అధికారులు అండగా ఉండాలని ఆమె సూచించారు. వర్షాలు అధికంగా ఉన్న నేపథ్యంలో సీజనల్‌గా వచ్చే వ్యాధులపై ప్రజలు అప్రమత్తంగా ఉండాలని కోరారు. సాధారణ జ్వరం వచ్చినా సమీపంలో ఉన్న ఆశా, అంగన్‌వాడీ కార్యకర్తలు, సీహెచ్‌డబ్ల్యూలను సంప్రదించి మందులు వినియోగించుకోవాలని, అప్పటికీ తగ్గని పరిస్థితి వస్తే సమీపంలోని ప్రభుత్వ ఆస్పత్రికి వెళ్లి వైద్య సేవలు పొందాలని ఆమె సూచించారు.

వీవీపీ ఎంప్లాయీస్ అసోసియేషన్ అడహాక్ కమిటీ

అనకాపల్లి టౌన్, జూలై 21: ఆంధ్రప్రదేశ్ వైద్య విధాన పరిషత్ ఎంప్లాయీస్ అసోసియేషన్ ఉమ్మడి విశాఖ జిల్లా అడహాక్ కమిటీ శనివారం ఏర్పాటైంది. అసోసియేషన్ రాష్ట్ర అడహాక్ కమిటీ ఎగ్జిక్యూటివ్ సభ్యుడుగా ఎన్నికైన ఎంఎస్ శంకరరావు తెలిపిన వివరాలివి.ఉమ్మడి విశాఖ జిల్లా అడహాక్ కమిటీ అధ్యక్షునిగా బి.వంశీ (అగనంపూడి), అసోసియేట్ ప్రెసిడెంట్‌గా డి.రజనీ (పాడేరు), గౌరవాధ్యక్షుడిగా ఎన్. నాదకిశోర్ (అరకు వేలీ), ఉపాధ్యక్షులుగా డి.లిల్లీ గ్రేస్ (పెందుర్తి), టి.పూనమ్ జ్యోతి (అనకాపల్లి), ప్రధాన కార్యదర్శిగా కేమీఎస్‌బీ చంద్రశేఖర్ (చింతపల్లి), ఆర్గనైజింగ్ సెక్రటరీగా పి.అప్పారావు (నర్సీపట్నం), జాయింట్ సెక్రటరీలుగా బి.ఉమాదేవి (అరకు వేలీ), ఆర్‌ఎల్ఎన్ జానకిరావు (కోటవురట్ల), కోశాధికారిగా పీఎస్ఈ రాజు (విశాఖపట్నం) ఎన్నికయ్యారు. అలాగే, ఎగ్జిక్యూటివ్ మెంబర్లుగా బి.రాణమ్మ (భీమిలి), సయ్యద్ ఇమామ్ (నక్కపల్లి), ఎ.రామలక్ష్మి (గోపాలపట్నం), డి.కిరణ్‌కుమార్ (వి.మాడుగుల), బి.సురేష్‌కుమార్ (కె.కోటపాడు), నవీన్‌కుమార్ (ఎలమంచిలి), ఎం.భాను (అనకాపల్లి), కె.పైడిరాజు (ముంచంగిపుట్టు) నియామకమయ్యారు.

సంక్షిప్తంగా..

సీఎం చంద్రబాబును కలిసిన జ్ఞానేశ్వరి


జ్ఞానేశ్వరి అందించిన వినతిని పరిశీలిస్తున్న చంద్రబాబు

చింతపల్లి, జూలై 21: ఆదివాసీల ప్రధాన సమస్యలను ముఖ్యమంత్రి చంద్రబాబు దృష్టికి తీసుకొని వెళ్లినట్టు టీడీపీ అరకు పార్లమెంట్ కార్యనిర్వాహక కార్యదర్శి చల్లంగి జ్ఞానేశ్వరి తెలిపారు. ఆదివారం ఆమె మంగళగిరి పార్టీ కార్యాలయంలో ముఖ్యమంత్రిని కలిసి వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా విలేకరులతో జ్ఞానేశ్వరి మాట్లాడుతూ జీవో నంబరు-3 అమలు చేయాలని, ఐటీడీఏల పరిధిలో ప్రత్యేక డీ ఎస్సీ ఏర్పాట చేయాలని కోరడం జరిగిందన్నారు. అలాగే శివారు గిరిజన గ్రామాలకు రహదారులు, పాఠశాలలకు శాశ్వత భవనాలు నిర్మించాలని ముఖ్యమంత్రి దృష్టికి తీసుకొని వెళ్లడంతో ఆయన సానుకూలంగా స్పందించారని ఆమె తెలిపారు. ఆమె వెంట టీడీపీ జిల్లా కార్యనిర్వాహక కార్యదర్శి చల్లంగి లక్ష్మణరావు ఉన్నారు.

'వైసీపీ హయాంలో జరిగిన నేర చరిత్ర మర్చిపోయారా'

గూడెంకొత్తవీధి, జూలై 21: వైసీపీ ప్రభుత్వ హయాంలో జరిగిన నేర చరిత్ర మర్చిపోయిన నాయకులు ఢిల్లీకి వెళ్లి ధర్నా చేస్తామని ప్రకటించడం సిగ్గుచేటని బీజేపీ నేత బొండ్ల చిరంజీవి అన్నారు. ఆదివారం విలేకరులతో ఆయన మాట్లాడుతూ రాష్ట్ర ప్రజలు ఓటుతో గుణపాఠం చెప్పినా మాజీ ముఖ్యమంత్రి జగన్ రెడ్డితో పాటు వైసీపీ నాయకులకు బుద్ధి రాలేదన్నారు. కూటమి పాలనకు ప్రజలు మద్దతిస్తుంటే జీర్ణించుకోలేని వారంతా రాష్ట్రంలో గవర్నర్ పాలన విధించాలని ఢిల్లీలో ధర్నా చేసేందుకు సిద్ధపడడం విచారకరమన్నారు. దళిత వైద్యుడు సుధాకర్‌ను పిచ్చోడుగా చిత్రీకరించి చంపింది వైసీపీ ప్రభుత్వం కాదా? అని ఆయన ప్రశ్నించారు. దళిత యువకుడు సుబ్రహ్మణ్యంను ఎమ్మెల్సీ అనంతబాబు హత్య చేసినప్పుడు వైసీపీ నాయకుల గొంతు ఎందుకు మూగబోయిందన్నారు. సొంత పార్టీ ఎంపీ రఘురామకృష్ణంరాజును చిత్రహింసలకు గురి చేశారని, ప్రచార ఆర్భాటం కోసం గీతాంజలిని చంపి శవరాజకీయాలు చేశారని ఆరోపించారు. ఏ ముఖం పెట్టుకుని జగన్ ఢిల్లీకి వెళతాడో ప్రజలకు సమాధానం చెప్పాలన్నారు. ఇప్పటికైనా పద్ధతి మార్చుకోకుంటే ప్రజలు శాశ్వతంగా బహిష్కరిస్తారని హెచ్చరించారు.

ఎస్‌టీ కమిషన్ సభ్యుడి దృష్టికి గిరిజన ప్రాంత సమస్యలు

పాడేరు, జూలై 21 (ఆంధ్రజ్యోతి): జిల్లాలోని గిరిజనులకు సంబంధించిన సమస్యలను జాతీయ ఎస్‌టీ కమిషన్ సభ్యుడు జాటోతు హుస్సేన్ దృష్టికి తీసుకువెళ్లామని భారతీయ జనతా పార్టీ ఉత్తరాంధ్ర జోనల్ ఇన్‌చార్జి లకే భాస్కరరావు ఒక ప్రకటనలో తెలిపారు. ప్రధానంగా మైదాన ప్రాంతంలో గిరిజనులు నివసిస్తున్న నాన్‌షెడ్యూల్డ్ ప్రాంతాలను షెడ్యూల్డ్ ఏరియాలో కలపాలని, గిరిజన ప్రాంతాల్లో గిరిజనేతరుల భూ ఆక్రమణలు అరికట్టాలని, ఐటీడీఏల ద్వారా గిరి రైతులకు రాయితీపై విత్తనాలు, ఎరువులు పంపిణీ చేయాలని, ట్రైకార్ ద్వారా స్వయం ఉపాధి పథకాల యూనిట్‌లను మంజూరు చేయాలని, యువతకు ఉపాధి అవకాశాలు కల్పించాలని, గిరిజన పల్లెల్లో సదుపాయాలు మెరుగుపర్చాలని, విద్య, వైద్య రంగాలను బలోపేతం చేయాలని ఎస్‌టీ కమిషన్ సభ్యుడు హుస్సేన్‌ను కోరామని బీజేపీ నేత లకే భాస్కరరావు తెలిపారు.

జీవో-117 రద్దు చేయాలి

హుకుంపేట, జూలై 21: జీవో నంబర్ 117ను తక్షణమే రద్దు చేయాలని పీఆర్‌టీయు జిల్లా గౌరవ అధ్యక్షులు కేబీ సింహాచలం డిమాండ్ చేశారు. కూటమి ప్రభుత్వం అమలు చేస్తున్న తల్లికి వందనం పథకాన్ని ప్రభుత్వ పాఠశాలల్లో చదువుతున్న విద్యార్థులకు అందిస్తే ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థుల నమోదు సంఖ్య పెరుగుతుందన్నారు. దీనివల్ల పాఠశాలలు మరింత బలోపేతమవుతాయని చెప్పారు. అలాగే జీవో 3ను అమలుచేసి శతశాతం ఉద్యోగాలు గిరిజనులకు కల్పించాలని కోరారు. ఎన్నికల సమయంలో ప్రభుత్వ ఉద్యోగులకు ఇచ్చిన హామీ మేరకు సీపీఎస్ రద్దు, 12వ పీఆర్‌సీ, ఐఆర్ అమలు చేయాలని విన్నవించారు.

విస్తృతంగా వాహన తనిఖీలు

ముంచంగిపుట్టు, జూలై 21: మండల కేంద్రంలో ఆదివారం విస్తృతంగా వాహన తనిఖీలను చేపట్టారు. నాలుగు రోడ్ల కూడలి, గ్రామ పొలిమేరల వద్ద ఉదయం నుంచి సాయంత్రం వరకు సీఆర్‌పీఎఫ్, ఏపీఎస్పీ పోలీసు బలగాలు ఎస్ఐ కె.రవీంద్ర ఆధ్వర్యంలో గస్తీ నిర్వహించాయి. అటుగా రాకపోకలు సాగించే వాహనాలను, ప్రయాణికుల లగేజీలను తనిఖీలు చేపట్టారు. ఈ సందర్భంగా ఎస్ఐ మాట్లాడుతూ కొద్ది రోజులుగా ముంచంగిపుట్టు, పెదబయలు మండలాల్లో జరిగిన దొంగతనాల నేపథ్యంలో వాహన తనిఖీలను ముమ్మరం చేశామని తెలిపారు. పని లేకుండా రాత్రి వేళల్లో ఎవరూ బయట తిరగరాదని సూచించారు. అపరిచిత వ్యక్తులు సంచరిస్తున్నట్టు తెలిస్తే పోలీసులకు సమాచారం అందించాలని ఆయన కోరారు.

ప్రజా మరుగుదొడ్లు ఏర్పాటుచేయరూ..

పాడేరు రూరల్, జూలై 21: పాడేరు అంబేడ్కర్ కూడలి సమీపంలో ప్రజా మరుగుదొడ్లు ఏర్పాటు చేయాలని ఏఐటీయూసీ జిల్లా కో-కన్వీనర్ అమర్ కోరారు. ఆదివారం విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ మూడు రోడ్ల జంక్షన్‌లో ఉన్న అంబేడ్కర్ కూడలి విశాఖ, జి.మాడుగుల ప్రాంతాలకు వెళ్లే ప్రయాణికులు, చిరు వ్యాపారులతో రద్దీగా ఉంటుందని, ఈ ప్రాంతంలో ప్రజా మరుగుదొడ్లు లేకపోవడం మహిళలు ఇబ్బందులకు గురవుతున్నారని చెప్పారు. అధికారులు స్పందించి ప్రజా మరుగుదొడ్లు ఏర్పాటు చేయాలని కోరారు. ఈ సమావేశంలో సీపీఐ నాయకులు హనుమంతురావు, వంతాల కృష్ణ పాల్గొన్నారు.

'ఏరియా ఆస్పత్రి సూపరింటెండెంట్‌గా హిమబిందును నియమించాలి'

చింతపల్లి, జూలై 21: ఏరియా ఆస్పత్రి సూపరింటెండెంట్‌గా ధారకొండ పీహెచ్‌సీ వైద్యాధికారి డీకే హిమబిందును నియమించాలని టీడీపీ మండల అధ్యక్షుడు కిల్లో పూర్ణచంద్రరావు విజ్ఞప్తి చేశారు. ఆదివారం విలేకరులతో ఆయన మాట్లాడుతూ ఏరియా ఆస్పత్రిలో రోగులకు వైద్యులు అందుబాటులో ఉండకపోవడంతో గిరిజనులకు మెరుగైన సేవలు అందడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. పది మంది వైద్యులు ఉన్నప్పటికీ, ఒకరిద్దరు మాత్రమే విధుల్లో ఉంటున్నారని ఆరోపించారు. డాక్టర్ హిమబిందు గతంలో ఏరియా ఆస్పత్రిలో రోగులకు మంచి సేవలు అందించారని గుర్తు చేశారు.